క్లుప్తంగా

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి



ఫిరంగిపురం: ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు అవసరమైన అన్ని సౌకర్యాలు ప్రభుత్వం, అధికారులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఇ.అప్పారావు అన్నారు. మండలంలోని పొనుగుపాడు, మునగపాడు, మేరికపూడి గ్రామాల్లో పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలను సోమవారం ఆయన పరిశీలించారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూలీలకు అవసరమైన పలుగు, పార, మందులుకిట్లు, పే స్లిప్పులు అందేలా చూడాలన్నారు. ఆయనవెంట సీఐటీయూ మండల కార్యదర్శి మస్తాన్‌వలి ఉన్నారు.

గడ్డివాము దగ్ధం



మంగళగిరి: పట్టణంలోని ద్వారకానగర్‌లో గడ్డివాము దగ్ధమైన ఘటన చోటు చేసుకుంది. బాధితుడు కుర్రా బుల్లయ్య తెలిపిన వివరాల మేరకు.. తన ఇంటి ముందు ఉన్న గడ్డివాములో సోమవారం మధ్యాహ్నం ఒక్క సారిగా మంటలు చెలరేగాయన్నారు. ఇంట్లో నుంచి గమనించి వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారమివ్వగా అగ్నిమాపక వాహనంతో వచ్చిన సిబ్బంది మంటలను కొంతవరకు అదుపులోకి తీసుకువచ్చారన్నారు. గడ్డివామికి ఎలా మంటలు అంటుకున్నాయో తెలియదని తెలిపారు. దగ్ధమైన గడ్డి విలువ రూ.2లక్షలు ఉంటుందని తెలిపారు.

విజయవాడ నుంచి హజ్ యాత్ర హర్షణీయం



తాడేపల్లి రూరల్: ముస్లింలు పవిత్రంగా భావించే హజ్ యాత్రకు రాష్ట్రంలోని విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి వరుసగా రెండో ఏడాది 2024 యాత్రకు వెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టడం హర్షణీయమని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. సోమవారం దుగ్గిరాల ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ సాధించినట్లు తెలిపారు. గతంలో హజ్‌యాత్రకు వెళ్లేందుకు హైదరాబాద్ చేరుకుని ఎన్నో వ్యయ ప్రయాసలు పడాల్సి వచ్చేదని, ప్రస్తుతం విజయవాడ నుంచి హజ్ యాత్రకు వెళ్లే సౌకర్యం కల్పించడం హాజీలకు ఎంతో సౌకర్యంగా ఉందన్నారు. విజయవాడ నుంచి 29వ తేదీ వరకు హజ్‌యాత్రికులు మూడు విమానాల్లో ప్రయాణమవుతున్నారని తెలిపారు. హజ్ యాత్రకు వెళుతున్న వారు విజయవంతంగా యాత్రను పూర్తి చేసుకుని క్షేమంగా తిరిగి రావాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్లో నెల రోజుల పాటు నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరం సోమవారం ముగిసింది. ఈసందర్భంగా గత నెల రోజులుగా వివిధ అంశాల్లో శిక్షణ పొందిన విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ వై.రధినీచౌదరి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపి, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు వేసవి శిక్షణ శిబిరం చక్కటి వేదికగా ఉపయోగపడిందన్నారు. ఆర్ట్స్, క్రాఫ్ట్స్, తైక్వాండో, కర్రసాము, క్రికెట్, ఫుట్‌బాల్, చెస్, వెస్ట్రన్ డ్యాన్స్, రోబోటిక్స్, సంగీత వాయిద్య అంశాల్లో నిర్వహించిన శిక్షణా శిబిరంలో 175 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ రధినీచౌదరి మాట్లాడుతూ సంప్రదాయ ఆటలతో పాటు క్రీడల్లో ప్రావీణ్యం సాధించేలా విద్యార్థులకు శిక్షణ కల్పించామని తెలిపారు. వేసవి శిక్షణా శిబిరాన్ని విద్యార్థులు చక్కగా సద్వినియోగం చేసుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓ కె.వెంకట్రావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నీతి కథల పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు నీతి కథలను చెప్పడంలో పోటీలను నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. నీతి కథలను చెప్పించడం ద్వారా విద్యార్థుల్లో సత్ప్రవర్తనతో పాటు ఆలోచించే తత్వం అలవడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.



మహబూబ్ షంషేర్ ఖాన్ మెమోరియల్ స్విమ్మింగ్ పూల్, పవర్ లిఫ్టింగ్ స్టేడియం



స్విమ్మింగ్ నేర్చుకుంటున్న ప్రజలు



అత్యాధునికంగా నిర్మించిన స్కేటింగ్ రింగ్



పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆట వస్తువులు

క్రీడల హబ్‌గా ఎంటీఎంసీ

డాక్టర్ వైఎస్సార్ క్రీడా ప్రాంగణం నిర్మాణంతో తీరిన నగర వాసుల కల

- అన్నిక్రీడలూ ఒక్క చోటే!
- సంతోషం వ్యక్తం చేస్తున్న క్రీడాకారులు
- రూ.10 కోట్లతో స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ ట్రాక్, పవర్ లిఫ్టింగ్ కోచింగ్‌కు స్టేడియాల నిర్మాణం
- నగర వాసుల్లో వేసవిలో ఉత్సాహం నింపిన క్రీడా ప్రాంగణ



డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ క్రీడా ప్రాంగణం

మంగళగిరి: నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ క్రీడా ప్రాంగణం సర్వహంగులతో రూపుదిద్దుకుంది. క్రీడా ప్రాంగణం ఏర్పాటుతో మంగళగిరి-తాడేపల్లి నగరం క్రీడా హబ్‌గా మారడంతో క్రీడాకారులు, కోచ్‌లు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మంగళగిరి-తాడేపల్లి నగరం శరవేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో రూ.10 కోట్లతో నగర పరిధిలో ఆత్మకూరు తాగునీటి పథకం ఆవరణలో డాక్టర్ వైఎస్సార్ క్రీడా ప్రాంగణం నిర్మాణం చేశారు.

నగర ప్రజలకు ఆరోగ్యం.. ఆహ్లాదం

డాక్టర్ వైఎస్సార్ క్రీడా ప్రాంగణంలో ఒకే చోట స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ ట్రాక్, పిల్లలకు ఆట వస్తువులు, పవర్ లిఫ్టింగ్ స్టేడియం, షటిల్ కోర్టులు నిర్మాణం చేశారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ(ఎంటీఎంసీ)ని క్రీడా హబ్‌గా తయారు చేసే అన్ని రకాల క్రీడాకారులకు అనుగుణంగా ఉండేలా శిక్షణా శాలలు, స్టేడియాలు ఏర్పాటు చేయాలనే ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) సూచనల మేరకు నగరపాలక సంస్థ అధికారులు పలు క్రీడలకు చెందిన శిక్షణ శాలలు, స్టేడియాల నిర్మాణాలకు చర్యలు తీసుకున్నారు. ఇవన్నీ నిర్మాణాలు పూర్తి చేసుకుని ప్రారంభం కావడంతో క్రీడాకారులు, కోచ్‌లు సంతోషం వ్యక్తం చేస్తుండగా నగర ప్రజలు ఆహ్లాదంతో పాటు ఆనందం పొందుతున్నారు.

ప్రముఖ కీడాకారుల పేర్లతో...

ఆయా క్రీడా స్టేడియాలకు అదే క్రీడలలో అంతర్జాతీయంగా ప్రఖ్యాతి గాంచిన ప్రముఖ ఆటగాళ్ల పేర్లతో నామకరణం చేయడంపై పలువురు క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్విమ్మింగ్ పూల్‌కు ప్రముఖ స్విమ్మర్ మహబూబ్ షంషేర్‌ఖాన్ మెమోరియల్ స్విమ్మింగ్ పూల్‌గా నామకరణం చేశారు. పవర్ లిఫ్టింగ్ కోచింగ్ సెంటర్‌కు పవర్‌లిఫ్టింగ్ కోచ్ గుమ్మడి పుల్లేశ్వరరావు పేరుతో నిర్మాణం చేశారు.

వీటితో పాటు నూతనంగా శాప్ నిధులతో చేపట్టనున్న షటిల్ కోర్టు ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు స్థలాలను పరిశీలించి ఇండోర్ స్టేడియం నిర్మాణానికి ఎక్కడ స్థలం అనువుగా ఉంటుందో అక్కడే స్థలం కేటాయించి త్వరలోనే పనులు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మరో వైపు నవులూరు అమరావతి టౌన్‌షిప్ తుదిదశకు చేరుకుంది. ఈ నేపథ్యంలో మరికొన్ని క్రీడలకు కోచింగ్ సెంటర్‌లు, స్టేడియాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు మంగళగిరి నియోజకవర్గం, ఎంటీఎంస్ నుంచి వచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తుండడంపై క్రీడాకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

క్రీడా హబ్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతోనే...



పిల్లలు చిన్నతనం నుంచే శారీరకంగా, మానసికంగా ఎదగాలంటే క్రీడలు ఎంతో అవసరం. క్రీడలపై ఆసక్తి వుండి అవకాశాలు లేక చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. కార్పొరేషన్‌ను క్రీడల హబ్‌గా తీర్చిదిదాలనే లక్ష్యంతోనే అన్ని క్రీడలను ఒకే చోట వుండేలా డాక్టర్ వైఎస్సార్ క్రీడా ప్రాంగణం నిర్మించడం జరిగింది.

– ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్యే, మంగళగిరి

కల నేరవేరింది ...



స్కేటింగ్ నేర్చుకోవాలనే కల మంగళగిరిలో స్కేటింగ్ రింగ్ నిర్మాణంతో తీరింది. ఇక్కడ స్కేటింగ్ రింగ్ లేకపోవడంతో విజయవాడ వెళ్లి డబ్బులు కట్టి స్కేటింగ్ నేర్చుకోలేక చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. ఆసక్తి వున్న వాళ్లం రోడ్లపై స్కేటింగ్ చేస్తుంటే.. కొన్నిసార్లు వాహనాలు అడ్డు వచ్చి ప్రమాదాల బారిన పడ్డాం. మాలాంటి చిన్నారులను గుర్తించి స్కేటింగ్ రింగ్ నిర్మించడమే కాక కోచ్‌లను ఏర్పాటు చేసి మాకు స్కేటింగ్ నేర్చుకునేందుకు సహకరించి ఎమ్మెల్యే ఆర్కేకు ధన్యవాదాలు తెలుపుతున్నాం.

– పి.భువిసాన్విత, స్కేటింగ్ నేర్చుకుంటున్న చిన్నారి, తాడేపల్లి

పవర్ లిఫ్టింగ్ స్టేడియం నిర్మాణం జీవితంలో మరిచిపోలేం..



మంగళగిరిలో పవర్ లిఫ్టింగ్ స్టేడియం నిర్మాణం జరుగుతుందని కలలో కూడా అనుకోలేదు. జిల్లాలోనే కాక రాష్ట్రంలోనే ఎక్కడా పవర్ లిఫ్టింగ్ స్టేడియం లేదు. మాలాంటి పవర్ లిఫ్టర్లు జిమ్‌లలో శిక్షణ తీసుకోవాల్సి వస్తుంది. మాలాంటి పవర్ లిఫ్టర్లను ప్రోత్సహించేందుకు ఎమ్మెల్యే ఆర్కే పవర్ లిఫ్టింగ్ స్టేడియం నిర్మించడం జీవితంలో మరచిపోలేం.

– షేక్ సాదియా అల్మాస్, అంతర్జాతీయ పవర్ లిఫ్టర్, మంగళగిరి

కలలో కూడా అనుకోలేదు..



మంగళగిరి-తాడేపల్లిలో అనేకమంది చిన్నారులు స్కేటింగ్ మీద ఆసక్తి చూపుతున్నారు. ఇక్కడ స్కేటింగ్ స్టేడియం లేకపోవడంతో అవకాశం వున్న వారు విజయవాడ వెళ్తుండగా అవకాశం లేనివాళ్లు వెళ్లలేకపోతున్నారు. ఆసక్తి వున్న వారు క్రీడపై మమకారంతో ఆటోనగర్ రోడ్లపైన స్కేటింగ్ చేస్తున్నారు. డాక్టర్ వైఎస్సార్ క్రీడా ప్రాంగణంలో స్కేటింగ్ రింగ్ నిర్మించడంతో అందరూ సంతోషంగా స్కేటింగ్ నేర్చుకుంటున్నారు. కార్పొరేషన్‌లో ఇలాంటి క్రీడా ప్రాంగణం రూపుదిద్దుకుంటుందని కలలో కూడా అనుకోలేదు.

– పొనిగేటి శ్రీకాంత్ రెడ్డి, స్కేటింగ్ కోచ్

శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం

అడిషనల్ ఎస్పీ జయరామరాజు



ప్రజలతో మాట్లాడుతున్న ఏఎస్పీ జయరామరాజు, పక్కన డీఎస్పీ అశోక్ గౌడ్

మేడికొండూరు: గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు వ్యవస్థ నిరంతరం కృషి చేస్తుందని అడిషనల్ ఎస్పీ(సీఐడీ) జయరామరాజు అన్నారు. సోమవారం మండల పరిధిలోని కొర్రపాడు, పాలడుగు గ్రామాల్లో అడిషనల్ ఎస్పీ జయరామరాజు, డీఎస్పీ అశోక్‌గౌడ్, సీఐ దార్ల జయకుమార్‌లు ప్రజలకు అవగాహన కల్పించారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టామన్నారు. జూన్ 4న జరిగే కౌంటింగ్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల పరిశీలన..

ఫిరంగిపురం: ఓట్ల లెక్కింపు ఫలితాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకుగాను ముందుగా మండలంలోని సమస్యాత్మక గ్రామాలను అడిషనల్ ఎస్పీ సీఐడీ(జిల్లా ప్రత్యేకపోలీసు అధికారి) సి. జయరామరాజు సోమవారం పరిశీలించారు. పొనుగుపాడు, నుదురుపాడు గ్రామాల్లో పర్యటించి, అక్కడి పరిస్థితుల గురించి తుళ్లూరు డీఎస్పీ ఇ.అశోక్ కుమార్ గౌడ్, సీఐ వీరేంద్రబాబును అడిగి తెలుసుకున్నారు.

నేడు నవులూరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి: మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని నవులూరులోని పలు ప్రాంతాలలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మక్కెవారి పేట, గోలివారి తోట, బాపనయ్య నగర్, ఈఎస్ఆర్ గార్డెన్, పుట్టరోడ్డు, ఉడా కాలనీ, శిబిరం, బాపూజీ నగర్‌లలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించాలని కోరారు.

దాడులకు పాల్పడితే గ్రామ బహిష్కరణే

తుళ్లూరు డీఎస్పీ ఇ.అశోక్ కుమార్ గౌడ్



మాట్లాడుతున్న డీఎస్పీ ఇ.అశోక్ కుమార్ గౌడ్

తాడికొండ: ఎన్నికల ఫలితాల సందర్భంగా గ్రామాల్లో ఎవరైనా దాడులకు ప్రేరేపించడం, ప్రత్యేక్షంగా దాడులకు పాల్పడినా అలాంటి వారిపై కఠిన చర్యలతో పాటు గ్రామ బహిష్కరణ తప్పదని తుళ్లూరు డీఎస్పీ ఇ.అశోక్ కుమార్ గౌడ్ హెచ్చరించారు. సోమవారం మందడం డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల13వ తేదీన జరిగిన ఎన్నికల సందర్భంగా తాడికొండ నియోజకవర్గంలో చిన్న చిన్న సంఘటనలు మినహా అన్ని చోట్ల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయన్నారు. జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలవడనున్న దృష్ట్యా పోలీసు శాఖ పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉందన్నారు. అవాంఛనీయ ఘటనలకు పాల్పడే వారికి చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. పాత కక్ష్యలు మనసులో పెట్టుకొని దాడులు, ప్రతి దాడులకు తెగబడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు పోలీసులు చేస్తున్న కృషికి సహకరించాలని లేదంటే గ్రామాల్లో పదేపదే గొడవలకు కారణమవుతున్న వ్యక్తులపై పీడీ యాక్టు నమోదు చేసి బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే వివాదాస్పద గ్రామాలతో పాటు అన్ని గ్రామాల్లో మైకు ద్వారా ప్రచారం నిర్వహించడం జరిగిందన్నారు. తుళ్లూరు మండలం పెదపరిమి, వడ్డమాను, తాడికొండ మండలం నిడుముక్కల గ్రామాల్లో ఎన్నికల సందర్భంగా జరిగిన గొడవల్లో కొంతమందిపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. అనవసరంగా వివాదాల్లో తలదూర్చి గొడవలు పెట్టుకొని కేసుల్లో ఇరుక్కొని బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. ఎన్నికల ఫలితాల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు కేంద్ర ప్రభుత్వానికి చెందిన 25 కంపెనీల పారా మిలటరీ దళాలు రాష్ట్రానికి వస్తున్నాయని, ఎన్నికల కమిషన్‌తో పాటు పోలీసు శాఖ ఫలితాల ప్రక్రియ, తదనంతర పరిణామాలు పర్యవేక్షిస్తుందని, ప్రజలు వివాదాలకు దూరంగా ఉండాలని సూచించారు.

మందడంలో శాంతి కమిటీ సమావేశం...

మందడం(తాడికొండ): ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ప్రజలు తాత్కాలిక ఆవేశాలకు లోను కాకుండా శాంతియుతంగా వ్యవహరిస్తే గ్రామంలో ప్రశాంత పరిస్థితులు ఏర్పడతాయని తుళ్లూరు డీఎస్పీ ఇ.అశోక్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. తుళ్లూరు మండలం మందడం గ్రామంలో సోమవారం డీఎస్పీ అధ్యక్షతన గ్రామంలోని ఇరువర్గాలతో విడివిడిగా శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు తగిన సేవలందించేందుకే పోలీసు శాఖ ఉందని సమస్యలు, ఇబ్బందులు ఎదురైతే తమ దృష్టికి తీసుకొస్తే సత్వరం పరిష్కరిస్తామని ఆవేశాలకు లోనై వివాదాలకు పోవద్దని సూచించారు. సొంత నిర్ణయాలతో ముందుకెళ్లి వివాదాస్పద పరిస్థితులకు అవకాశం కల్పించకుండా, గ్రామంలో ప్రశాంత పరిస్థితులు ఏర్పడేందుకు సహకరించి ముందస్తుగా తమకు సమాచారం అందించాలన్నారు. వివాదాల కారణంగా కేసులు నమోదైతే యువత, విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు, షేక్ సుభానీ, సీహెచ్ అనురాధ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిరస కావ్యం ఆముక్తమాల్యద



నగరంపాలెం: ఆముక్తమాల్యద భక్తిరస కావ్యమని ఆధ్యాత్మిక ప్రవచకురాలు డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి అన్నారు. భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఆముక్తమాల్యదపై ఆధ్యాత్మిక ధారావాహిక ప్రవచనాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరగనున్న ప్రవచన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీరంగనాయకి మాట్లాడుతూ కృతిక నిర్మాణానికి కారకులు కుమారరాజు అని అన్నారు. విష్ణు చిత్తులవారి పూర్వాపరాలు గతంలో తెలుసుకున్నామని చెప్పారు. వారు మాలా కైంకర్యాలు చేయడం ప్రారంభించారని తెలిపారు. మాలికలు సమర్పించి వెళ్తుండగా స్వామి వారు ప్రసన్నుడైనారని అన్నారు.

యెర్నేని సీతాదేవి మృతికి సంతాపం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ విద్యాశాఖ మంత్రి, విజయ డెయిరీ డైరెక్టర్ యెర్నేని సీతాదేవి మృతిపట్ల రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ సోమవారం ఓప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని సీతాదేవి నివాసానికి వెళ్లి, కుటుంబసభ్యులను కలిసిన శివాజీ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఎన్టీఆర్ మంత్రి వర్గంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన సీతాదేవి విద్యారంగంలో అనేక సంస్కరణలు తెచ్చారని ఆయన గుర్తు చేశారు.

హెల్త్ వెల్‌నెస్ సెంటర్ పరిశీలన



కేంద్రంలోని ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎంకాస్ సెంట్రల్ టీం సభ్యులు

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని సచివాలయం -2 పరిధిలోని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను ఢిల్లీకి చెందిన ఎంకాస్ సెంట్రల్ టీం సభ్యులు డాక్టర్ ఆనందిసత్య, డాక్టర్ హరికేష్‌లు సోమవారం పరిశీలించారు. వెల్ నెస్ సెంటర్లో ప్రజలకు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలపై ఆరోగ్యసిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్ని రకాల పరీక్షలు చేస్తున్నారో దానికి సంబంధించి మెటీరియల్, ఎన్ని రకాలు మందులు అందజేస్తున్నారో దానికి సంబంధించి రిజిస్టర్లను పరిశీలించారు. వాటితో పాటు ఏఎన్‌సీ, ప్రెగ్నెంట్, డ్రగ్స్, ఫాల్‌అప్ రిజిష్టర్లు, జోన్ రిజిష్టర్, ట్రెనింగ్ రిజిష్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. వారికి హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ద్వారా అందుతున్న సేవల తీరు తెన్నులను ఫిరంగిపురం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్తేరురాణి తెలియజేసారు. ఎం.వాసుదేవరాజ్, సీహెచ్‌ఓ వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పశువుల యజమానికి నష్టపరిహారం అందించాలి

ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య



యజమాని నుంచి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకుంటున్న వి.కృష్ణయ్య, తదితరులు

తాడేపల్లి రూరల్: గుంటూరు జిల్లా, తాడేపల్లి రూరల్ చిర్రావూరులో ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో మృతి చెందిన పశువుల యజమానికి నష్టపరిహారం ఇవ్వాలని ఏపీ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం రైతు సంఘం నాయకులతో కలసి చిర్రావూరులో ప్రమాదం జరిగిన తీరును పశువుల యజమానులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కృష్ణయ్య మాట్లాడుతూ బస్సు ప్రమాదంలో నోరులేని పాడిపశువులు మృతి చెందడం దురదృష్టకరమన్నారు. పాడి సంపదపై జీవనం సాగిస్తున్న రైతులకు తీరని నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులకు ఒక్కో గేదెకు రూ.లక్ష చొప్పున నష్టపరిహారాన్ని ప్రభుత్వం అందించాలన్నారు. పరిశీలనలో సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు, తాడేపల్లి మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు, రైతు సంఘం రాజధాని నాయకులు కొర్రపోలు ఈశ్వరరెడ్డి, తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బొప్పన గోపాలరావు, మేడూరి పాములు, తాడేపల్లి మండల నాయకులు పల్లపాటి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

31న కార్మికుల నిరసన

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని బ్రహ్మానందపురంలో సిమెంట్ ఫ్యాక్టరీ మూతబడి మే 31వ తేదీకి 31 సంవత్సరాలు పూర్తికానుండడంతో కార్మికులు నిరసనకు సిద్ధమవుతున్నట్లు సిమెంట్ ఫ్యాక్టరీ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ యూనియన్ సెక్రటరి స్టీవెన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిమెంట్ ఫ్యాక్టరీ సిబ్బందితో పాటు ఇతరులు కూడా పాల్గొని కార్మికులకు మద్దతు పలకాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

నేటి నుంచి హనుమత్ జయంత్యుత్సవాలు

- హనుమాన్ ఉత్సవాల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ
- 31న గుంటూరు నగరంలో స్వామివారి గ్రామోత్సవం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏసీ, పాలకవర్గం, హనుమాన్ దీక్షా సమాజం సభ్యులు

నగరంపాలెం: గుంటూరు కొత్తపేట ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఈనెల 28 నుంచి వచ్చేనెల 2 తేదీ వరకు స్వామి వారి హనుమత్ జయంత్యుత్సవాలు నిర్వహించనున్నారు. హనుమాన్ ఉత్సవాల వాల్‌పోస్టర్లను సోమవారం దేవస్థానం ఆవరణలో దేవస్థానం సహాయ కమిషనర్ (ఏసీ)/ఈఓ శ్రీనివాస్, దేవస్థానం చైర్మన్ నూరినేడి దుర్గవరప్రసాద్, శ్రీహనుమాన్ దీక్షా సమాజం గౌరవాధ్యక్షులు తిరువళ్లూరి వెంకటసుబ్బారావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ ముఖ్య అర్చక స్వామి తదితరులు ఆవిష్కరించారు. స్వామివారి హనుమజ్జయంతి కార్యక్రమాలకు ఈనెల 28 రాత్రి అంకురార్పణ, 29 ఉదయం 10 గంటలకు లక్ష తులసి పూజ, 30 ఉదయం 10 గంటల కు లక్ష మల్లెల పూజ, 31 ఉదయం 10 గంటలకు లక్ష ఆకు పూజ, రాత్రి 8 గంటలకు శ్రీ హనుమాన్ దీక్షా సమాజం ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో శ్రీ స్వామి వారి గ్రామోత్సవం ఉంటుందని తెలిపారు. జూన్ ఒకటిన హనుమత్ జయంతి సందర్భంగా ఉదయం 11 గంటలకు శ్రీ స్వామి వారికి సహస్ర ఘటాభిషేకం, రాత్రి 8 గంటలకు శ్రీ సువర్చలా ఆంజనేయస్వామి వారి కల్యాణం నిర్వహించనున్నారు. రెండో తేదీ ఉదయం 11 గంటలకు పూర్ణాహుతి, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టనున్నారు. దీక్షా సమాజం సభ్యులు నాగేశ్వరరావు, అనీల్‌కుమార్, వంశీ, జగదీష్, సీహెచ్.రమేష్, బాపిరాజు, మారుతీ పాల్గొన్నారు.

యూరాలజీ విభాగానికి వైద్య పరికరాలు



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లోని యూరాలజీ విభాగానికి రూ.4.5లక్షల విలువ గల వర్కింగ్ ఎలిమెంట్ వైద్య పరికరాలను అందచేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. సోమవారం యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ జి.మనోహర్‌కు వైద్య పరికరాలను అందచేశారు. మూత్రనాళం నుంచి ప్రోస్టేట్ గ్రంథి తొలగించడానికి, మూత్ర ధార సన్నపడితే సరి చేయడం, మూత్రాశయంలో కణుతులు, రక్తపు గడ్డలు తొలగించేందుకు ఈ వైద్య పరికరాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. మూత్రాశయానికి సంబంధించిన వ్యాధులతో బాధ పడే పేద రోగులు ఎక్కువ మంది జీజీహెచ్‌కు వస్తున్నారని, ఆధునిక సేవలు పేదలకు అందించేందుకు వైద్య పరికరాలను అందజేశామన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ అస్లాం. డాక్టర్ మొహిసిన్, డాక్టర్ రాకేష్ ప్రదీప్‌లు పాల్గొన్నారు.